# భారత శ్రామిక మార్కెట్ నివేదిక - 2008

దేశంలో అమల్లో ఉన్న సంస్కరణల నేపథ్యంలో.. శ్రామిక మార్కెట్‌లో ఇటీవల కాలంలో అనేక ముఖ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయని భారత శ్రామిక మార్కెట్ నివేదిక-2008 నివేదిక అభిప్రాయపడింది. దీని ప్రకారం ఉద్యోగిత లేని వృద్ధి, ప్రాంతాల మధ్య తేడాలు, స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు కనిపిస్తున్నాయి. నైపుణ్యం గల శ్రామికుల డిమాండ్, వారి లభ్యత మధ్య కూడా తేడాలున్నాయి. ముఖ్యంగా ఇవన్నీ అభివృద్ధి చెందుతున్న (emerging) రంగాల్లో కనిపిస్తున్నాయి.

**శ్రామిక మార్కెట్ – ముఖ్యాంశాలు:**

- పట్టణ ప్రాంత ప్రజలతో పోల్చినప్పుడు గ్రామీణ ప్రాంత ప్రజల్లో అన్ని రకాల ఉపాధిలో వృద్ధి 1999–2000 నుంచి 2005–06 మధ్య కాలంలో ఎక్కువ.
- గ్రామీణ పురుషుల్లో శ్రామిక శక్తి వృద్ధి పట్టణ పురుషుల కంటే ఎక్కువ.
- ఉపాధి, నిరుద్యోగిత వృద్ధి రేటు పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ.
- తక్కువ విద్యార్హతలు కలిగిన వారి కంటే ఉన్నత విద్యనభ్యసించిన వారిలో నిరుద్యోగం ఎక్కువగా ఉంది. దీంతో పాటు నిరుద్యోగితా వృద్ధి రేటు పురుషుల కంటే మహిళలలో ఎక్కువ.
- పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి పొందుతున్న, తాత్కాలిక శ్రామికుల వాటా ఎక్కువ.
- క్రమంగా (రెగ్యులర్‌గా) వేతనాలు పొందుతున్న వారి సంఖ్య గ్రామీణ ప్రాంతాలతో పోల్చినప్పుడు పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ.
- తాత్కాలిక శ్రామిక మార్కెట్, స్వయం ఉపాధి కేటగిరీలలో పురుషుల కంటే స్త్రీలుఎక్కువ.

**శాశ్వత ఉపాధి (Regular Employment):**

- స్వయం ఉపాధి, తాత్కాలిక ఉపాధితో పోల్చినప్పుడు శాశ్వత ఉపాధి తక్కువ.
- శాశ్వత ఉద్యోగితలో పురుషుల భాగస్వామ్యంలో పెద్దగా మార్పులేనప్పటికి స్త్రీల భాగస్వామ్యం పెరుగుతుంది.
- శాశ్వత ఉద్యోగితకు, విద్యాస్థాయికి మధ్య సంబంధం ఉంది. అక్షరాస్యత రేటు ఎక్కువగా ఉన్న ఢిల్లీ, కేరళ, గోవాలో మొత్తం ఉద్యోగితలో శాశ్వత ఉద్యోగితా రేటు ఎక్కువ. కాగా తక్కువ అక్షరాస్యత ఉన్న ఒరిస్సా, బీహార్, జార్ఖండ్‌లలో మొత్తం ఉద్యోగితలో శాశ్వతంగా ఉపాధి పొందుతున్న వారి శాతం తక్కువ.
- వయసుతో నిమిత్తం లేకుండా గ్రామీణ స్త్రీ, పురుషుల మధ్య శాశ్వత ఉద్యోగితలో తేడా ఎక్కువగా ఉంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 20 నుంచి 34 ఏళ్లలోపు ఉన్న వయోవర్గం వారిలో శాశ్వత ఉపాధి

ఎక్కువ.

## స్వయం ఉపాధి (Self Employment):

- రాష్ట్రాల్లో స్వయం ఉపాధి పొందుతున్న వారి మొత్తం శాతం ఆయా రాష్ట్రాల ఉద్యోగితలో 30 నుంచి 70 శాతం మధ్య ఉంది. కొంతమేర అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోల్చితే అలాభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య ఎక్కువ. అల్పాభివృద్ధి చెందిన రాష్ట్రాలైనా బీహార్లో 61 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 69 శాతం, రాజస్థాన్‌లో 70 శాతం మంది స్వయం ఉపాధి కార్యక్రమాల్లో నిమగ్నం కాగా, అభివృద్ధి చెందిన కేరళలో 42 శాతం, ఢిల్లీలో 38 శాతం, గోవాలో 34 శాతం మంది స్వయం ఉపాధి పొందుతున్నారు.
- స్వయం ఉపాధి పొందిన వారిలో విద్యార్హతలు ఎక్కువగా ఉన్నాయి. ఈ విద్యార్హతలు పురుషులతో పోల్చినప్పుడు స్త్రీలలో తక్కువ.
- స్వయం ఉపాధిని రంగాల వారీగా పరిశీలించినపుడు వ్యవసాయ రంగంలో స్వయం ఉపాధి ఎక్కువ. తర్వాతి స్థానంలో వాణిజ్యం ఉంది. స్వయం ఉపాధి మొత్తంలో ఈ రెండు కార్యకలాపాలలో నిమగ్నమయిన వారు 3/4 వంతు మంది ఉన్నారు.

## తాత్కాలిక శ్రామిక మార్కెట్ (Casual Labour Market )

- ఎన్ఎస్ఎస్ఓ 62వ రౌండ్ అంచనా ప్రకారం దేశంలో 31 శాతం ఉద్యోగిత తాత్కాలిక శ్రామిక మార్కెట్‌కు చెందింది. దీనిలో పురుషులతో పోల్చినప్పుడు స్త్రీల భాగస్వామ్యం ఎక్కువ.
- తాత్కాలిక శ్రామిక మార్కెట్‌లో స్త్రీ, పురుషులు, ప్రాంతాల మధ్య భాగస్వామ్యం విద్యార్హతను మెరుగుపరచుకొనే కొద్ది తగ్గుతుంది. ఈ మార్కెట్‌లో ఎక్కువ మంది శ్రామికులు నిరక్షరాస్యులు లేదా ప్రాథమిక విద్యను అభ్యసించినవారు.
- ఈ మార్కెట్‌లో 70 శాతం మంది వ్యవసాయ రంగంలో ఉండగా మిగతా శ్రామికులు పారిశ్రామిక, సేవా రంగాలలో ఉన్నారు. వ్యవసాయ రంగంలో తాత్కాలిక శ్రామికులు అభివృద్ధి చెందిన మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్‌లో ఎక్కువగా ఉంటే అల్పాభివృద్ధిచెందిన రాజస్థాన్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాంచల్‌లో పారిశ్రామిక రంగంలో వీరి సంఖ్య ఎక్కువ.
- అల్పాభివృద్ధిరాష్ట్రాల్లో పారిశ్రామికరంగ తయారీ కార్యకలాపాల్లో తాత్కాలిక శ్రామికులు ఎక్కువ. ఈ రాష్ట్రాలలో నిర్మాణ రంగంలోనూ వీరి సంఖ్య ఎక్కువే.

## నిరుద్యోగిత, అల్ప ఉద్యోగిత:

- గ్రామీణ ప్రాంత ప్రజలతో పోల్చినప్పుడు పట్టణ ప్రాంత ప్రజలలో నిరుద్యోగిత రేటు ఎక్కువ. పట్టణ

ప్రాంత స్త్రీలలో నిరుద్యోగిత రేటు 9.22 శాతం కాగా గ్రామీణ ప్రాంత స్త్రీలలో 7.31శాతంగా ఉంది.

- రాష్ట్రాల వారీగా నిరుద్యోగితను పరిశీలించినపుడు అభివృద్ధి చెందిన గోవా, కేరళలో నిరుద్యోగితా రేటు 11.30 శాతం, 9.13 శాతంగా ఉంది. నిరుద్యోగితా రేటు అల్పాభివృద్ధి చెందిన ఉత్తరాంచల్‌లో 0.48 శాతం కాగా ఛత్తీస్‌గఢ్‌లో 0.77 శాతం.

24 ఏళ్లలోపు ఉన్న వారిలో నిరుద్యోగులు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇది యువకుల్లో నిరుద్యోగ పెరుగుదలను సూచిస్తుంది.

- సెకండరీ విద్యాస్థాయి పూర్తి చేసిన వారిలో నిరుద్యోగిత రేటు ఎక్కువ. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన చదువుకున్న మహిళల్లో నిరుద్యోగిత రేటు ఎక్కువగా ఉంది.
- గ్రామీణ మహిళల్లో ఎక్కువగా అల్ప ఉద్యోగిత కనిపిస్తుంది.
- అన్ని విధాలైన ఉపాధి కేటగిరీలకు సంబంధించి అల్ప ఉద్యోగితను పరిశీలించినప్పుడు స్వయం ఉపాధి, తాత్కాలిక శ్రామికుల్లో అల్ప ఉద్యోగిత ఎక్కువ. క్రమంగా వేతనాలు పొందే శ్రామికుల్లో అల్ప ఉద్యోగిత తక్కువ.

**శ్రామిక శక్తిలో లేని జనాభా:**

- ప్రాంతాల వారీగా శ్రామిక శక్తిలో చేరని జనాభా పరిశీలించినపుడు.. పురుషులతో పోల్చినప్పుడు మహిళల శాతం ఎక్కువ.
- గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాలలో శ్రామిక శక్తిలో లేని మహిళల శాతం ఎక్కువ. అనేక రాష్ట్రాల్లో శ్రామిక శక్తిలో లేని గ్రామీణ మహిళలు 60 నుండి 70 శాతం మంది ఉండగా, పట్టణాల్లో 80 శాతం వరకు మహిళలు ఈ జాబితాలో లేరు.
- 25 నుండి 59 సంవత్సరాల వయోవర్గంలో ఉన్న మహిళల్లో 47 నుండి 57 శాతం వరకు శ్రామిక శక్తిలో లేరు. శ్రామిక శక్తిలో లేని పురుషుల శాతం ఈ వయోవర్గానికి సంబంధించి 1 నుండి 9 మాత్రమే. గ్రాడ్యుయేట్ విద్యార్హత కలిగిన మహిళల్లో 68 శాతం మంది పురుషుల్లో 13 శాతం మంది శ్రామిక శక్తిలో లేరు. పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్హత ఉన్న మహిళల్లో 53 శాతం మంది పురుషులలో 10 శాతం మంది శ్రామిక శక్తిలో లేరు.
- ఎక్కువ శాతం మంది మహిళలు శ్రామిక శక్తిలో చేరకపోవడానికి కారణం వారు ఇంటి పనులకు పరిమితం కావడం. 25 నుండి 59 సంవత్సరాల వయోవర్గంలో ఉన్న మహిళలలో 60 శాతం మంది గృహ అవసరాలకు పరిమితం అయ్యారు. గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళలలో గృహ అవసరాలకు పరిమితమయిన మహిళల శాతం (60 శాతం) సమానంగా ఉంది.
- రాష్ట్రాలవారీగా శ్రామిక శక్తిలో లేని ప్రజల మధ్య వ్యత్యాసాలు ఎక్కువగా లేవు. పురుషుల విషయంలో అన్ని రాష్ట్రాల మధ్య తేడా లేదు కానీ స్త్రీల విషయంలో మాత్రం తేడా కనిపిస్తుంది. మహిళల్లో శ్రామిక శక్తిలో లేని వారి శాతం ఉత్తరాది రాష్ట్రాలైన ఢిల్లీలో 92.10 శాతం, చత్తీస్‌ఘడ్‌లో 89.50 శాతం ఉంది, కాగా తక్కువగా హిమాచల్‌ప్రదేశ్‌లో 51.70 శాతం మంది ఉన్నారు.

- 25 నుండి 60 వయోవర్గంలో ఉన్న పురుషుల్లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పురుషుల్లో 40 శాతం మందికి పనిలో సామర్థ్యం తక్కువగా ఉంది.

## అభివృద్ధి చెందుతున్న (Emerging) రంగాల్లో ఉద్యోగిత:

- అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఎక్కువ మంది రిటైల్ రంగంలో ఉపాధి పొందుతున్నారు. సంఘటిత, అసంఘటిత శ్రామిక మార్కెట్‌తో కలిపి రిటైల్ రంగంలో ఉపాధి పొందుతున్న వారి శాతం మొత్తం ఉద్యోగితలో 7.1 శాతం.
- తర్వాత స్థానంలో 5.9 శాతం మంది నిర్మాణ రంగంలో ఉన్నారు.
- ఆరోగ్య, రక్షణ రంగంలో మహిళలు ఎక్కువగా ఉపాధి పొందారు.
- మైనింగ్, టెక్స్‌టైల్స్, లోహాలు, ఆభరణాలు,ఆటోమొబైల్స్, రవాణా, ఐటీ/బీపీఓ రంగాల్లో అక్టోబర్-డిసెంబర్ 2008 మధ్య కాలంలో ఉద్యోగిత 1.01 శాతం తగ్గగా అది 2009 జనవరి నాటికి 1.17 శాతానికి పెరిగింది.
- అక్టోబర్-డిసెంబర్ 2008 మధ్య ఐటీ/బీపీఓలపై ఆధారపడిన రంగాల్లో ఉద్యోగితావృద్ధి రుణాత్మకంగా ఉండగా వజ్రాలు, ఆభరణాల రంగంలో ఉద్యోగిత గరిష్టంగా తగ్గింది.

## ముఖ్య పట్టణాలు, నగరాలలో ఉద్యోగిత, నిరుద్యోగం

- అన్ని కేటగిరీలకు చెందిన నగరాల్లో ప్రాథమిక స్థాయి వృత్తులకు సంబంధించి మహిళా ఉద్యోగితలో తగ్గుదల ఎక్కువగా ఉంది. ద్వితీయ రంగ వృత్తుల్లో వీరి ఉద్యోగిత కొంత మెరుగ్గా ఉండగా తృతీయ రంగ వృత్తుల్లో ఉద్యోగిత గణనీయంగా పెరిగింది.
- క్లాస్ 2, క్లాస్ 3 నగరాల్లో తృతీయ రంగంలో మహిళా ఉద్యోగిత పెరిగింది. కొన్ని నగరాల్లో ఈ పెరుగుదల 90 శాతం వరకు ఉంది.
- పురుషులతో పోల్చినప్పుడు అధిక శాతం క్లాస్ 1 నగరాల్లో తృతీయ రంగంలో మహిళా ఉద్యోగిత పెరుగుదల ఎక్కువగా ఉంది.
- క్లాస్ 1 నుంచి క్లాస్ 2, క్లాస్ 3 నగరాలకు వలస వెళ్లే కొద్ది పట్టణ పురుషుల్లో ఉద్యోగ హోదాలో మార్పులు సంభవిం చాయి. క్లాస్ 1 నగరాలలో మిగతా నగరాల కంటే క్రమంగా వేతనాలు పొందే వారి శాతం ఎక్కువ. క్లాస్ 2, క్లాస్ 3 నగరాల్లో స్వయం ఉపాధి, తాత్కాలిక శ్రామికులు ఎక్కువ.
- క్లాస్ 2, క్లాస్3 నగరాలతో పోల్చినపుడు క్లాస్ 1 నగరాల్లో శ్రామిక శక్తిలో చేరని పురుషుల శాతం ఎక్కువ.
- పట్టణ పురుషుల నిరుద్యోగితా రేటుతో పోల్చినప్పుడు అన్ని నగరాల్లో స్త్రీల నిరుద్యోగితా రేటు ఎక్కువగా ఉంది.
- ఉద్యోగిత కేటగిరీ ఉన్న పట్టణ జనాభాలో 45.25 శాతం మంది స్వయం ఉపాధి కేటగిరీకి చెందినవారు, తదుపరి 39.72 శాతం మంది రెగ్యులర్‌గా వేతనాలు పొందేవారు కాగా మిగతా 15.01 శాతం మంది తాత్కాలిక ఉద్యోగులు.
- అన్ని నగరాలలో నిరుద్యోగితా రేటు 2.4 శాతం కాగా 47 శాతం మంది ప్రజలు శ్రామిక శక్తిలో చేరలేదు.